క్లుప్తంగా

సమర్థవంతంగా తరల్ కార్యక్రమం



మాట్లాడుతున్న అర్బన్ రేంజ్ ఎంఈఓ- 2 రమా రజని

కంబాలచెరువు: టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ (తరల్) కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించాలని రాజమహేంద్రవరం అర్బన్ రేంజ్ ఎంఈఓ- 2 రమా రజని అన్నారు. స్థానిక డీఎంహెచ్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు చదవడం, రాయడంపై ప్రత్యేక శ్రద్ధ చూపేలా చూడాలన్నారు. తరల్ కార్యక్రమంలో నిర్దేశించిన కృత్యాలను ప్రతి రోజూ నిర్వహించాలన్నారు. ప్రతినెల చివరి వారంలో జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు ఉపాధ్యాయులు విధిగా హాజరై, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వచ్చేనెల మూడు నుంచి జరగబోయే ఫార్మేటివ్ 2 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎస్. రాజాప్రశాంత్, కార్యదర్శి పరస జగన్నాథరావు, సీఆర్పీ జయంతి శాస్త్రి, కోటేశ్వరి పాల్గొన్నారు.

జాషువా పురస్కారానికి నక్కా శ్రీనగేష్ ఎంపిక



నక్కా శ్రీనగేష్

సీటీఆర్ఐ: నగరానికి చెందిన నక్కా శ్రీనగేష్.. గుర్రం జాషువా సాహితీ పురస్కారాన్ని అందుకోనున్నారు. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఈ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ నిర్వాహకుడు అద్దంకి రాజా యోనా నుంచి శ్రీనగేష్‌కు ఆహ్వానం అందింది. ఈనెల 28న ఏలూరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి ఆయనకు అవార్డు అందజేస్తారు. కాగా.. శ్రీనగేష్‌ను ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాశరావు అభినందనలు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కంబాలచెరువు: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లాలోని ముఖ్య కూడలిలో ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమం చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ చేసిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రకాశం నగర్: ప్రభుత్వ విద్యాసంస్థల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రాంబాబు, ఎన్.రాజా మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీలు తెరిచి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటికీ పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండా ఉంటే విద్యార్థులు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. అనంతరం సబ్ కలెక్టర్ ఏవో శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు.

2 వరకూ ప్రత్యేక కార్యక్రమాలు

కంబాలచెరువు: స్వచ్ఛతాహీ సేవ 2023 ప్రచారంలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని అన్ని న్యాయస్థానాలలో ఈ నెల 15 నుంచి అక్టోబర్ 2 వరకూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. పునర్వినియోగానికి పనికిరాని ప్లాస్టిక్ వాడకాన్ని తగు ప్రత్యామ్నాయాల ద్వారా నిషేధించాలన్నారు. ప్రజలు తమ ఇళ్లను, పరిసరాలను, పనిచేస్తున్న కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మన జీవన శైలిలో చిన్నపాటి మార్పులు చేసుకోవాన్నారు. ప్రజలందరూ శ్రమదాన కార్యక్రమాలలో పాల్గొని ఆ ఫొటోలను స్వచ్ఛతహీసేవ.కామ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

విజిలెన్స్ కమిటీ సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం మండల స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం తహసీల్దార్ పైడి చిన్నారావు అధ్యక్షతన జరిగింది. వినియోగదారులకు అందించాల్సిన సేవలు, ఇతర సమస్యలపై చర్చించారు. సంబంధిత శాఖ అధికారులు, నాన్ ఆఫీషియల్స్ హాజరయ్యారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, సర్వే డిప్యూటీ తహసీల్దార్ సాగర్, మండల విద్యాశాఖాధికారులు తులసీదాస్, చందు కుమార్ పాల్గొన్నారు.

సమన్వయంతో సాగుదాం

- నిమజ్జనం వేళ అప్రమత్తంగా ఉండాలి
- నిబంధనలు పాటించాలి
- ఉత్సవ కమిటీలకు అధికారుల సూచన



నిమజ్జనానికి సిద్ధమైన దుళ్ల శివాలయం వీధిలోని భారీ గణనాథుడు

కడియం: గణపతి నవరాత్ర ఉత్సవాలు చివరి దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో గణనాథుని విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీసు శాఖలు దృష్టి సారించాయి. ఉత్సవ పందిళ్లకు అనుమతుల నుంచి, ఉత్సవాల నిర్వహణ వరకూ సామరస్య పూర్వకంగా జరిగేందుకు ప్రభుత్వ శాఖలు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో కృషి చేశాయి. అదే స్ఫూర్తితో నిమజ్జనం కార్యక్రమం కూడా జరిపించేందుకు సమగ్రంగా చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా ప్రత్యేకంగా నిర్దేశించిన రేవుల్లోనే నిమజ్జనాలు జరిగే విధంగా ఉత్సవ కమిటీలు సహకరించాలని ఇప్పటికే, ఆయా కమిటీలకు పోలీసులు అవగాహన కల్పించారు. నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరిగేందుకు ప్రధానంగా ఉత్సవ కమిటీలే బాధ్యత వహించాలని పోలీసు వారు స్పష్టం చేస్తున్నారు.

ముందు జాగ్రత్త చర్యలు

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలో రూరల్, కడియం మండలాల్లో సుమారు 300లకు పైగా గణనాథుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు అంచనా. తొమ్మిది రోజుల ఉత్సవాల నిర్వహణకు రెవెన్యూ, పోలీసు శాఖల అనుమతితో పలు చోట్ల భారీ సైజు విగ్రహాలను ఆయా కమిటీలు ఏర్పాటు చేసారు. వీరిలో 20శాతానికి పైగా విగ్రహాల నిమజ్జనాలు ఐదోరోజునే పూర్తయ్యాయి. మంగళవారం నాటికి తొమ్మిది రోజులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో బుధ, గురు వారాల్లో మిగిలిన విగ్రహాల నిమజ్జనాలు పూర్తి చేసేందుకు ఉత్సవ కమిటీలు కోరిన విధంగా అనుమతి మంజూరు చేశారు. దీంతో బుధ, గురువారాల్లో జరిగే నిమజ్జన కార్యక్రమాలకు పోలీసు శాఖ సకల చర్యలు చేపట్టింది. గోదావరి గట్టు, ధవళేశ్వరం రామపాదాల రేవు, కడియం బ్రాహ్మణరేవు, కడియపులంక శివాలయం వద్ద, మాధవరాయుడుపాలెం కాలువరేవు, జేగురుపాడు ఆడదాని రేవులను నిమజ్జనాలకు నిర్దేశించారు. ఆయా ప్రదేశాల్లో గజఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే పోలీసు, రెవెన్యూ సిబ్బంది పికెట్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఊరేగింపులో భాగంగా డీజే బాక్సులు, అశ్లీల నృత్యాలు వంటివి ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఇబ్బంది లేకుండా నిర్వహించాలి

మండల పరిధిలో వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరిగాయి. నిమజ్జనోత్సవం కూడా అదే రీతిలో నిర్వహించుకోవాలని ఇప్పటికే ఆయా కమిటీలకు అవగాహన కల్పించాం. ఊరేగింపు సమయంలో తోటి వారికి, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉత్సవ కమిటీలదే. మండలంలో 100 వరకు ఉత్సవ పందిళ్లలో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇప్పటికే 30 వరకూ నిమజ్జనాలు పూర్తయ్యాయి. మిగిలినవి బుధ, గురువారాల్లో పూర్తి చేసేందుకు కమిటీలు సంసిద్ధత వ్యక్తం చేశాయి. అందుకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నాం. నిర్దేశించిన రేవుల్లో మాత్రమే నిమజ్జనాలు చేయాలి. అనుమతి లేని చోట్ల ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. అందువల్ల అక్కడ నిమజ్జనం చేయవద్దని కమిటీలను కోరుతున్నాం.

– పీవీజీ తిలక్, పోలీస్ ఇన్‌స్పెక్టర్, కడియం.

గణనాథునికి ఎంపీ భరత్ పూజలు



మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

సీటీఆర్ఐ: స్థానిక 22వ డివిజన్ మెయిన్ రోడ్డు నూనె కొట్ల దిగువన నాళం భీమరాజు వీధిలోని సిద్ధి లక్ష్మిగణపతి ఆలయంలో 173వ గణపతి నవరాత్ర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా కొత్తా బాలమురళీకృష్ణ, విజయ రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి దివ్యకళ్యాణం, సహస్ర దీపాలంకరణ మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ భరత్ రామ్ తొలుత ఆలయంలోని మూల విరాట్‌ను, ఉత్సవ మండపంలో గణపతిని దర్శించుకున్నారు. అనంతరం 23వ వార్డు గోదావరి గట్టి సాయిబాబా గుడి దగ్గర నందివాడ వారి వీధిలో వాకచర్ల కృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పీతా రామకృష్ణ, ఎస్వీ శ్రీనివాస్, కల్లే చిన్ని, ఆరవ సురేష్, ఎజ్జవరపు శ్రీను, అరే చిన్ని, పెద్ది రాజు పాల్గొన్నారు.

యువతి అనుమానాస్పద మృతి



నాగేశ్వరి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండ తమ్మారావుపేటకు చెందిన ముప్పిడి నాగేశ్వరి (25) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పిడి కృష్ణ మూడో కుమార్తె నాగేశ్వరి జీఎన్ఎమ్ చదుకుని నాలుగేళ్లుగా రాజమహేంద్రవరంలోని డెల్టా హాస్పిటల్‌లో పని చేస్తోంది. విధులు ముగించుకుని సోమవారం రాత్రి 8 గంటలకు ఇంటికి వచ్చి పడుకుంది. మంగళవారం తెల్లవారుజామున తండ్రి కృష్ణ గుమ్ములూరుకు పని కోసం వెళ్లాడు. అనంతరం ఉదయం 8 గంటల సమయంలో అన్నయ్య కాటన్ దొర చూసేసరికీ నాగేశ్వరి మంచం మీద నుంచి కింద పడిపోయి చలనం లేకుండా ఉంది. ఆమె కుడి చేతిపై ఇంజెక్షన్ చేసుకున్నట్టు ఆనవాలు ఉన్నాయి. తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే ఈ ఘటనలో ఆస్పత్రిలో పనిచేసే అనిల్‌పై కృష్ణ అనుమానం వ్యక్తం చేశారు.

ఘనంగా దేవానంద్ శతజయంత్యుత్సవం



దేవానంద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అలనాటి బాలీవుడ్ అగ్ర నటుడు దేవానంద్ శత జయంతిని స్థానిక జిత్ మోహన్ మిత్ర కళావేదికలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నట గాయకుడు, ఆర్కెస్ట్రా పితామహుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బి. సీతారామారావు జ్యోతి ప్రజ్వలన చేశారు. శ్రీపాద మిత్ర మాట్లాడుతూ దేవానంద్ తన అద్భుతమైన నటనతో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి, పురస్కారాలు అందుకున్నారన్నారు. జల్లి శివప్రసాద్ మాట్లాడుతూ దేవానంద్ పాటలతో జిత్ మోహన్ ఆర్కెస్ట్రా ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహించారన్నారు. డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడు మాట్లాడుతూ దేవానంద్ వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని, పట్టుదలతో నటుడిగా, దర్శక నిర్మాతగా విజయం సాధించారన్నారు. జిత్ మోహన్ ఆర్కెస్ట్రా గాయకులు వి.కామేశ్వరరావు, మార్కండేయులు, డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడు.. దేవానంద్ పాటలను ఆలపించారు. దేశినీడి బలరాం నాయుడు, వి.జగపతి, గిడ్డి నరసింహమూర్తి, విశ్వనాథ్ సీతామహాలక్ష్మి దంపతులు, శ్రీపాద శంకరరావు, గోపాలాచార్య, వెంకట శ్రీనివాస్, తాళం మణిధర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా అద్వితీయ 2023



కల్చరల్ డేలో మెడికోల సందడి

రాజానగరం: జీఎస్ఎల్ వైద్య కళాశాల కల్చరల్ డే సందర్భంగా అద్వితీయ 2023 పేరిట ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం మెడికోలు ఆటలు, పాటలతో హోరెత్తించారు. సంప్రదాయం, మోడ్రన్, పాశ్చాత్య ఇలా .. వివిధ రకాల డ్రస్సులు ధరించి, వయ్యారాలు ఒలకబోస్తూ స్టేజ్ పై 'క్యాట్ వాక్' చేస్తూ చూసే కేరింతలు కొట్టించారు. 10 సింగిల్ షోలు, 8 డ్యుయోల్ షోలు, 10 గ్రూప్ డాన్స్‌లతో పాటు ఫ్యాషన్ షో, ఫ్లాష్ మాబ్ డ్యాన్స్, దాండియాతో సందడి చేశారు.

కొమ్మల కత్తిరింపులో జాగ్రత్తలు అవసరం

రాజానగరం: పామాయిల్, కొబ్బరి తోటలలో కొమ్మలను కత్తిరించే సమయంలో పరిసరాలలో ఉన్న విద్యుత్ తీగలను కూడా దృష్టిలో పెట్టుకుని పనులు చేపట్టాలని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం డీఈఈ నటరాజన్ రైతాంగాన్ని హెచ్చరించారు. విద్యుత్ భద్రతా నియమాల పై మండలంలోని మల్లంపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆ ప్రాంతానికి చెందిన రైతులతో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్ వైవీఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల పరిశీలన

- రెండో డివిజన్‌లో సిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పర్యటన
- పలు సమస్యల పరిష్కారానికి చర్యలు



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: మౌలిక సదుపాయాల అభివృద్ధిపై క్షేత్రస్థాయి పరిశీలన చేపడుతున్నామని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక రెండో డివిజన్లో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి డివిజన్ ఇన్‌చార్జి మానే దొరబాబు ఆధ్వర్యంలో పర్యటించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేశారు. నగరపాలక సంస్థ అధికారులు, స్థానిక నాయకులు, పెద్దలు, సచివాలయ ఉద్యోగులు ఆయన వెంట ఉన్నారు. ప్రధానంగా డ్రైనేజీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయా డ్రైన్ల నిర్మాణానికి అవసరమైన రీతిలో ప్రతిపాదన తయారుచేసి సత్వరం పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలో ఆయా సమస్యలను, నిర్మాణ దశలో ఉన్న డ్రైన్లను, సీసీ రోడ్లను పరిశీలించారు. త్వరిత గతిన పనులు పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాయుడు గణేష్, జె.వెంకటరమణ, ఇంటి దొరబాబు, సచివాలయ ఉద్యోగులు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

తొర్రేడు సహకార సొసైటీ సందర్శన



తొర్రేడు సొసైటీని సందర్శించిన రామదాసు సహకార శిక్షణ కేంద్రం విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)ని మంగళవారం రాజమహేంద్రవరం రామదాసు సహకార కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు సందర్శించారు. జిల్లా సహకార శిక్షణ ఇన్‌చార్జి, రామదాసు శిక్షణ కేంద్రం అధ్యాపకులు ఆదిమూలం వెంకటేశ్వరరావు సహకార విద్య, సంఘం చేసే సేవలను వివరించారు. నాగార్జున ఫెర్టిలైజర్ అండ్ కెమికల్స్ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు సరఫరా చేసే ఎరువుల విక్రయం, ఈపాస్ గురించి విద్యార్థులకు వివరించారు. సంఘ సీఈవో కొడవలి వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ సంఘం నిర్వహణ, పనితీరు, విధులు, సిబ్బంది బాధ్యతలను తెలిపారు. రామదాసు శిక్షణాకేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘ బైలాల గురించి, మహాజన సభ ఏర్పాటు చేయడం, తీర్మానాలు చేసే విధానంపై వివరించారు. డీసీసీబీ బ్రాంచి నోడల్ ఆఫీసర్ ఉమారాణి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 52 బ్రాంచీల ద్వారా 299 సొసైటీలలో సభ్యులకు వ్యవసాయ రుణాలు పంపిణీ చేస్తున్నామన్నారు. డీసీసీబీ బ్రాంచి మేనేజర్ జి.అప్పారావు, సంఘ చైర్‌పర్సన్ చిట్టూరి వెంకటరావు, పర్సన్స్ దండమూడి అర్జునరావు, గద్దే సుబ్బారావు, బ్రాంచి సూపర్ వైజర్ లోకేష్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సంస్థ సేవలు అభినందనీయం



అన్నదానంలో పాల్గొన్న మాజీ ఎంపీ అరుణ్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నిరుపేదలకు స్వర్ణాంధ్ర సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పుష్కర్ ఘాట్‌లో జరిగిన స్వర్ణాంధ్ర ఫ్రీ మొబైల్ ఫుడ్ సర్వీస్ సేవలో ఆయన వారి బంధువుల పేరున అన్నదానం చేశారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు మాట్లాడుతూ ఉచిత అన్నదాన సేవా కార్యక్రమానికి అరుణ్ కుమార్ ఒక మారుతీ వ్యాన్ బహుకరించారన్నారు. వారి కుటుంబ సభ్యుల తరఫున జరిగే అన్ని కార్యక్రమాలనూ స్వర్ణాంధ్రలో జరుపుతారన్నారు. పుష్కర్ ఘాట్‌లో 250 మందికి, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద 200 మందికి ప్రతిరోజు ఆహారం అందిస్తున్నామని, ఇది అక్టోబర్ 10 నాటికి నాలుగో ఏడాదిలోకి చేరుతుందన్నారు. ఈ సందర్భంగా సుమారు 250 మందికి అన్నదానంతో పాటు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ పూర్వపు అధ్యక్షులు అల్లు బాబీ, చాంబర్ ఆఫ్ కామర్స్ పూర్వపు అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్, స్వర్ణాంధ్ర మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నదిలో దూకిన వ్యక్తిని రక్షించిన పోలీసులు

కంబాలచెరువు: గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు రక్షించారు. వివరాల్లోకి వెళితే.. రాజానగరం మండలం కొండగుంటూరుకు చెందిన శ్రీనివాస్ ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోవాలని రోడ్ కం రైల్వే బ్రిడ్జి వద్దకు వచ్చి గోదావరిలో దూకాడు. అక్కడ చేపల వేట చేస్తున్నవారు వెంటనే స్పందించి, అతడిని నదిలోంచి పైకి తీసుకువచ్చారు. 100 ద్వారా విషయం తెలుసుకున్న రెండో పట్టణ పోలీసులకు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. శ్రీనివాస్‌ను 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాస్‌ను రక్షించిన రెండో పట్టణ పోలీసులు ఎం.పోసియ్య, ఎం.సత్యనారాయణ, వై.లీలాకుమార్‌ను రెండో పట్టణ సీఐ గణేష్, పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

యువకుడిపై పోక్సో కేసు

సీతానగరం: నిడదవోలు మండలం గోపవరానికి చెందిన 31 ఏళ్ల ఛామకుర్తి సుధాకర్‌పై ఫోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం కేసులు నమోదు చేశామని ఎస్సై కె.చిరంజీవి మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వెదుళ్లపల్లికి చెందిన బాలిక అదే గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదివింది. ఆ సమయంలో గోపవరం నుంచి వచ్చిన సుధాకర్ హైస్కూల్లో భవన నిర్మాణ పనులు చేసేవాడు. ఆ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న ఆ బాలిక సుధాకర్ వద్దకు వెళ్లగా, ఈనెల 23న గొరీపట్నంలో వివాహం చేసుకున్నాడు. అయితే తన కుమార్తె కనిపించడం లేదంటూ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. ఆ బాలికను అదుపులోకి తీసుకుని విచారించగా పైవిషయాలు తెలిపింది. ఈ కేసును డీఎస్పీ దర్యాప్తు చేస్తారని ఎస్సై చిరంజీవి వివరించారు.

డోర్‌మేట్ల తయారీపై శిక్షణ

రాజానగరం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కృషి చేస్తోందని రాజమహేంద్రవరంలోని సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ అన్నారు. కొబ్బరి పీచుతో డోర్ మేట్లు తయారు చేసే విధానంపై రెండు నెలల పాటు కలవచర్ల కేవీకేలో ఇచ్చే శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు.

ఎస్‌పీపీ శ్రీనివాసరావుకు అభినందన



ఎస్‌పీపీ పీతాని శ్రీనివాసరావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు: పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష పడేలా వాదనలు వినిపించి, గెలిచిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీతాని శ్రీనివాసరావును జిల్లా ఎస్పీ పి.జగదీష్ సన్మానించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయనను ఎస్పీ సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు. సంతోష్ నగర్‌కు చెందిన సుంకర రామకృష్ణ తన కన్న కూతురిపై లైంగిక దాడి చేసిన ఘటలో పోక్సో స్పెషల్ కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే.

ఆర్థిక నైపుణ్యత అవసరం

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ బ్యాంకింగ్ సిస్టంపై మంగళవారం గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత, నైపుణ్యత స్థిరత్వం, వ్యక్తిగత ఆర్థిక నిర్వహణ, పొదుపు, బడ్జెట్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు షేర్స్ సెక్యూరిటీస్‌పై అవగాహన అవసరమన్నారు. కా

ఎన్ఎస్ఎస్‌పై అవగాహన సదస్సు

కంబాలచెరువు: జాతీయ సేవా పథకంలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందిరాగాంధీ ఎన్ఎస్ఎస్ అవార్డు గ్రహీత, ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు ఎస్‌పీడీ పాల్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో పాల్గొనడం వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది స్వచ్ఛంద కార్యకర్తలతో ప్రపంచంలోనే యువశక్తి సంస్థగా ఎన్ఎస్ఎస్ రూపొందిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు మల్లికార్జున, సుభాషిణి, జరీనాబేగం, భవానీ, మురళీకృష్ణ, జాకేజ్, సురేష్, ఈసూబ్ బాషా పాల్గొన్నారు.

టీడీపీ దీక్షలు

కడియం: స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదురుగా కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ కార్యాలయం వద్ద టీడీపీ నిరాహారదీక్షలు మంగళవారం జరిగాయి. శిబిరాన్ని మాజీ మంత్రి కళా వెంకట్రావు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ తదితరులు సందర్శించి, మద్దతు తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంతో మానవ వికాసం

రాజానగరం: పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం మానవ వికాసానికి ఉపయోగపడాలి గానీ, మానవ విలువలకు హాని కలిగించేలా ఉండకూడదని గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి అన్నారు. కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ బేసిక్ సైన్సెస్ (హెచ్‌బీఎస్) విభాగం ఆధ్వర్యంలో మానవతా విలువలు, సంస్కృతి, మానవ సంబంధాలు అనే అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. నేటి ఆధునిక సమాజంలో పిల్లలు, పెద్దలు సెల్‌ఫోన్లకు అతుక్కుపోవడాన్ని ప్రస్తావిస్తూ ఇది మంచి పరిణామం కాదన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. చంద్రయ్య మాట్లాడుతూ మనిషి ఎదుగుదలకు టెక్నాలజీ ఎంత అవసరమో, సంస్కృతి, సంప్రదాయాలు కూడా అంతే అవసరమన్నారు. హెచ్ఓడీ ఎ.మాధవీ కామేశ్వరి, తెలుగు అధ్యాపకురాలు ఎ.దేవీశైలజ పాల్గొన్నారు.

వృద్ధుడికి గాయాలు

సీతానగరం: మండలంలోని కాటవరానికి 62 ఏళ్ల బొల్లి వెంకట రామయ్యను మోటారు సైకిల్ ఢీకొనడంతో గాయాలయ్యాయని, ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై కె.చిరంజీవి మంగళవారం తెలిపారు. వెంకట రామయ్య సోమవారం తన మోటారు సైకిల్‌పై ఆర్వోప్లాంట్ వద్దకు క్యాన్‌తో వెళ్లుతుండగా, గుర్తు తెలియని వ్యక్తి మోటారు సైకిల్ ఢీకొందన్నారు. గాయపడిన అతడిని రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారన్నారు.